క్లుప్తంగా

ఘనంగా సామూహిక యజ్ఞోపవీత ధారణ


యజ్ఞోపవీత ధారణ చేస్తున్న గాండ్ల కులస్తులు

బైరెడ్డిపల్లె: రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకుని మండలంలోని శెట్టిపల్లెలో సోమవారం గాండ్ల కులస్తులు సామూహిక యజ్ఞోపవీత ధారణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని బాటగంగమ్మ ఆలయం వద్ద అర్చకులు కన్నప్పచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గాండ్ల కులస్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఏటా తమ గ్రామంలో ఈ కార్యక్రమాన్ని ఆనవాయితీగా నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

సర్దుబాటుతో మెరుగైన విద్యాబోధన

పుంగనూరు: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా టీచర్లను సర్దుబాటు చేసి విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందేలా చర్యలు తీసుకుంటున్నట్టు ఎంఈఓలు చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెన్నశెట్టి తెలిపారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలు, ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలలను గుర్తించి ఈ సర్దుబాటు చేస్తున్నట్టు చెప్పారు. టీచర్లు దీనికి సహకరించి ఆయా పాఠశాలల్లో మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని కోరారు.

నాగాభరణం సమర్పణ


నాగాభరణానికి పూజలు చేస్తున్న అర్చకులు

సదుం: స్థానిక వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయానికి దాతలు నాగాభరణం సమర్పించారు. కంభంవారిపల్లె క్రాస్‌కు చెందిన హరినాథ రెడ్డి, హేమలత దంపతులు రూ.1. 20 లక్ష విలువ చేసే నాగాభరణాన్ని సోమవారం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు కృష్ణారెడ్డికి అందజేశారు. ప్రత్యేక పూజలు చేసి, ఆభరణాన్ని స్వామి వారికి అలంకరించారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌సీటీ శిక్షణ తనిఖీ చేసిన డీవైఈఓ


శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీవైఈఓ చంద్రశేఖర్

పలమనేరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ కార్యక్రమాన్ని చిత్తూరు డీవైఈఓ చంద్రశేఖర్ సోమవారం తనిఖీ చేశారు. ఈ శిక్షణ టీచర్ల వృత్తి నైపుణ్యాలను మెరుగు పరచుకునేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం, ఏఎస్‌ఓ నారోత్తమరెడ్డి, హెచ్‌ఎంలు ఈశ్వర్ ప్రసాద్, షంషీర్, ఆర్‌పీలు పాల్గొన్నారు.

ఆగని ఏనుగుల దాడులు


ఏనుగులు ధ్వంసం చేసిన వరి పంటను చూపుతున్న రైతు రాజప్ప

ఐరాల: అటవీప్రాంత సరిహద్దు గ్రామాల పొలాలపై ఏనుగులు పదే పదే దాడులు చేస్తూ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఆదివారం రాత్రి నాగంవాండ్లపల్లె ఫారెస్టు బీటు నుంచి వచ్చి ఏనుగులు బసివిరెడ్డిఇండ్లుకు చెందిన నరేంద్ర సాగు చేసిన వరి పంటను తొక్కి నాశనం చేసి, అరటి చెట్లను విరిచేశాయి. మరో రైతు భాస్కర్ వరి పంటను ధ్వంసం చేశాయి. నయనంపల్లెలో రాజప్ప, హరి వరి పంటలను తొక్కి నాశనం చేసి, జయచంద్రారెడ్డి కొబ్బరి చెట్లను కూల్చేశాయి. సుమారు రూ.70 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. ఏనుగుల వల్ల చేతికొచ్చిన పంటలను నష్టపోతున్నామని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు ఏనుగుల దాడిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించి, నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

అపుస్మా జిల్లా కార్యదర్శిగా అమరనాథరెడ్డి

బంగారుపాళెం: ఆంధ్రప్రదేశ్ ప్రవేట్ అన్-ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోషియేషన్ (అపుస్మా) జిల్లా జనరల్ సెక్రటరీగా బంగారుపాళెంకు చెందిన అమరనాథరెడ్డి(విద్యార్థి హైస్కూల్ కరస్పాండెంట్) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. సోమవారం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

పట్టుదలతో ఆదాయం

మండలంలోని రైతులకు పట్టు పురుగుల పెంపకం బాగా కలసి వస్తోంది. రాష్ట్రంలో వీ.కోట మండలం పట్టు పురుగుల పెంపకంలోనే మొదటి స్థానంలో ఉంది. రైతులు పట్టువిడవకుండా సాగు చేస్తూ పసిడి పంటగా రేషం తోటలతో ఆదాయం కళ్లజూస్తున్నారు. ఇక్కడి వాతావరణం పట్టు పురుగుల పెంపకానికి అనువుగా ఉండడంతో రైతులు దీనిపై మక్కువ చూపుతున్నారు.

- ఎకరాకు రూ 40 వేల నుంచి 50 వేల వరకు లాభం
- నిపుణుల సూచనలతో సున్నపు కట్టు వ్యాధి నియంత్రణ


వీ.కోటలో సాగులో ఉన్న మల్బరీ తోట

వి.కోట: మండలంలో ప్రస్తుతం 618 మంది రైతులు 2,305 ఎకరాల్లో మల్బరీ సాగు చేశారు.రాష్ట్రంలోనే అధిక దిగుబడితో 80 కేజీలు, 100 గుడ్లకు బెస్ట్ క్వాలిటీ పట్టు గూళ్లను పండిస్తూ ప్రతి నెలా రూ.40 వేల నుంచి 50 వేల వరకు ఎకరాకు నికర ఆదాయం పొందుతున్నారు. అయితే ఉష్ణోగ్రత మార్పుల వల్ల సున్నపుకట్టు వ్యాధి సోకి కొంతవరకు నష్టం వాటిల్లుతోంది. ఈ నేపథ్యంలో ఉష్ణోగ్రతల నియంత్రణకు మెళకువలు పాటిస్తే పట్టులో మరింత ఆదాయం పొందవచ్చు అంటున్నారు సెరికల్చర్ అధికారి హనుమంతరాయ.

చలి ప్రభావంతో నష్టం

గాలిలో ఉష్ణోగ్రతలు పడిపోవడం వల్ల గాలిలో తేమశాతం పెరిగి బ్యాక్టీరియా, ఫంగస్, సూక్ష్మజీవుల వల్ల పట్టు పురుగులకు సున్నపుకట్టు వ్యాధి సోకుతుంది. దీంతో పట్టుగూళ్ల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుంది. చలి, వర్షాకాలల్లో ఈ వ్యాధి ఎక్కువగా వ్యాపిస్తుంది. వ్యాధి బారిన పడిన పురుగులు జీర్ణశక్తి కోల్పోయి డీలా పడిపోతాయి. నల్లటి మచ్చలతో ఆప్టో టాక్సిన్ అనే విష పదార్థం ఉత్పత్తై పురుగులు చనిపోతాయి.

ఉష్ణోగ్రత నియంత్రణలో తీసుకోవలసిన జాగ్రత్తలు

- పట్టు పురుగులు పెంచే షెడ్డు, పెంచడానికి వాడే వస్తువులు శుభ్రంగా ఉంచుకోవాలి.
- పట్టు పురుగులు పెంచే షెడ్డులో 70–80 శాతం తేమ, 25–28 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండేలా చూసుకోవాలి.
- రాత్రి వేళ 20 డిగ్రీల కన్నా తక్కువగా ఉండే బొగ్గుల కుంపటి, ఎలక్ట్రికల్ హీటర్‌ను ఏర్పాటు చేసి ఉష్ణోగ్రత పెంచాలి.


చౌడేపల్లె వద్ద పట్టు పురుగుల షెడ్డు

- వాటిని వాడే సమయంలో కిటికీలు, వాకిళ్ల తెరవాలి లేకపోతే వాటికి బూజు పట్టే అవకాశం ఉంది.
- రాళ్ల సున్నంపై నీళ్ల చల్లి పొడి చేసిన సున్నం వాడాలి.
- రోజూ పురుగుల పడకలను శుభ్రం చేసి వ్యర్థాలను షెడ్డుకు దూరం గొయ్యి తీసి పూడ్చాలి.
- తెల్లబూజు, కట్టురోగం వంటి రోగాలు సోకి చనిపోయిన పురుగులను, నాసిరకంగా ఉన్న గూళ్లను పంట పూర్తయిన తర్వాత షెడ్డుకు దూరంగా కాల్చివేయాలి.
- షెడ్డును శుభ్రపరిచేటప్పుడు రెండు శాతం బ్లీచింగ్ పౌడర్, 0.2 శాతం సున్నపు పొడి ద్రావణంతో శుభ్రం చేసుకోవాలి.
- గదిలో గోడలు, స్టాండ్ కింద సున్నపు పొడి చల్లాలి.
- చలి ఉన్నపక్షంలో రైతులు తప్పనిసరిగా ఉష్ణోగ్రతల నియంత్రణ జాగ్రత్తలు తీసుకుంటే లాభాల పంటే పండుతుంది.

ఇన్సెంటివ్ ఇవ్వాలి



నేను దాదాపు 12 ఏళ్లుగా రెండు ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తూ పట్టు పురుగుల పెంపకం చేస్తున్నా. ఆదాయం బాగుంది. అయితే ప్రస్తుతం వీ.కోటలో చాకీ సెంటర్ లేదు. మేము కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి చాకీని తెచ్చుకోవాల్సి వస్తోంది. అంతేకాక గతంలో కేజీకి ప్రతి రైతుకూ రూ.50 ఇన్సెంటివ్ ఇచ్చేవాళ్లు. ఇప్పుడు రెండేళ్లుగా ఇవ్వడం లేదు. ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టాలి.
–రమేష్, మల్బరీ రైతు, దాసార్లపల్లె, వీ.కోట

రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి



పట్టుగూళ్ల పెంచడానికి షెడ్డు ఏర్పాటు కోసం ఒక రైతుకు రూ. 3 లక్షల వరకు సమగ్ర పథకం కింద ప్రభుత్వం ఇస్తుంది. ఒక ఎకరాలో మొక్కలు నాటితే రూ.10,500 వరకూ ప్రభుత్వం చెల్లిస్తుంది. అంతేకాక మందులు, యంత్రాలు, వేపపిండి వంటివి వాటిని కూడా ప్రభుత్వం రాయితీపై రైతులకు ఇస్తుంది. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.
–హనమంతరాయ, సెరికల్చర్ అధికారి, వీ.కోట

కోల్‌కతా ఉదంతంపై నిరసన ర్యాలీ


పట్టణంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు

పలమనేరు: కోల్‌కతాలో ఉదంతంపై విద్యార్థి లోకం భగ్గుమంది. అసలైన దోషులెవరో తేల్చి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం గంగవరం ఎంవీఆర్ కళాశాల విద్యార్థినులు సోమవారం పలమనేరులో భారీ ర్యాలీ చేశారు. కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీసుధా మాట్లాడుతూ, కోల్‌కతాలోని మెడికల్ కళాశాలలో ఎన్నో ఘోరాలు జరిగాయని ట్రైనీ డాక్టర్ తెలుసుకుని ప్రశ్నించడంతోనే ఇంత దారుణం జరిగిందనే అనుమానాలు ఉన్నాయన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేసి నిందితులకు శిక్ష పడేలా చూడాలన్నారు. వైద్యులపై ఇలాంటి దారుణ కృత్యాలు చోటుచేసుకోకుండా మరింత కఠినమైన చట్టాలు తేవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైద్యులపై దాడులు శోచనీయం

పుంగనూరు: వైద్యులు, వైద్య విద్యార్థులపై దాడులు, అత్యాచారాలు, హత్యలు శోచనీయమని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎస్ఆర్.అశోక్ అన్నారు. కోల్‌కతా ఉదంతం నేపథ్యంలో సోమ వారం మాల మహానాడు నాయకులు అంబేద్కర్ కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. కోల్‌కతాలో పీజీ డాక్టర్ హత్యాచారం కేసులో నిందితులను ఉరి తీయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు ఉధృతమవుతున్నా ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని, ఇలాంటి దాడులను ముక్తకంఠంతో అందరూ ఖండించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. మాలమహానాడు ప్రతినిధులు నరసింహులు, తోట శ్రీనివాసులు, వెంకటరమణ, శంకర, నాగరాజ, రెడ్డి, భాస్కర్, రమణ పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లపై కొమ్మలు తొలగించండి

చౌడేపల్లె: విద్యుత్ లైన్లకు ప్రమాదకరంగా ఉన్న చెట్లు, కొమ్మలను తొలగించాలని ట్రాన్స్‌కో డీఈఈ శ్రీనివాసమూర్తి ఆదేశించారు. సోమవారం ట్రాన్స్‌కో కార్యాలయంలో క్షేత్ర స్థాయి సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. గ్రామాల్లో కొన్నిచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లపై కొమ్మలు, తీగలు తొలగించాలన్నారు. విద్యుత్ బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించి సకాలంలో వసూలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జి ఏఈ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఈఈ శ్రీనివాసమూర్తి

పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు


హాజరైన పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు
–జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: గ్రామాల్లో మురుగునీటి కాలువల శుభ్రత, వీధి దీపాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మహ్మద్ రఫీ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, సర్పంచుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జెడ్పీ చైర్మన్ మాట్లాడారు. వర్షాల నేపథ్యంలో విషజ్వరాలు ప్రబలుతున్నాయని, గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు కార్యదర్శులు, సర్పంచులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. మురుగు కాలువలు, తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. అలాగే దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేయాలని, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. వీధిలైట్ల ఏర్పాటులో అశ్రద్ధ వహించరాదన్నారు.

నామఫలకాలు తెలుగులో రాయించరూ!

పలమనేరు: పట్టణంలోని దుకాణాలు, సంస్థలు, కార్యాలయాల పేర్లను తెలుగులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు సోమవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈనెల 29న తెలుగు భాషా దినోత్సవం లోపు కౌన్సిల్ అనుమతితో ఈ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నడిమిగడదేశిలో రామకోటి జపం


రామకోటి జపిస్తున్న భక్తులు


పుంగనూరు: మండలంలోని నడిమిగడదేశిలో శ్రీరామాలయం నిర్మించి ఏడాది కావస్తున్న సందర్భంగా సోమవారం రామకోటి పారాయణం చేశారు. గ్రామస్తులు ఆలయంలో శ్రీరామచంద్రుల విగ్రహాలకు అభిషేకం, హోమ పూజలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామస్తులు రామకోటి జపించి అన్న ప్రసాద వితరణ చేశారు.

ఆలయాల్లో పున్నమి పూజలు


ప్రత్యేక అలంకారంలో శ్రీవెంకటేశ్వరస్వామి

పుంగనూరు: స్థానిక కోనేటి వద్ద ఉన్న శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం పున్నమి పూజలు నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు ఆధ్వర్యంలో అర్చకులు శ్రీనివాసచార్యులు వేకువజామున అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. మూలవిరాట్‌ను ప్రత్యేక పూలతో అలంకరించి , హోమాలు నిర్వహించారు. అలాగే ఉత్సవ మూర్తులను అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. అలాగే మండలంలో ఏడూరులోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి హోమాలు, అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లో సత్యనారాయణ స్వామి వ్రతమాచరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

• రక్షా బంధన్


కలెక్టర్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి

చిత్తూరు కలెక్టరేట్: రాఖీపౌర్ణమి పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డ్వామా పీడీ రాజశేఖర్ లకు బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టారు. అనంతరం కరపత్రాలను ఉన్నతాధికారులకు అందజేశారు. కార్యక్రమంలో చిత్తూరులోని బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విద్యాలయ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో విగ్రహ ప్రతిష్ఠాపన



పెద్దిరెడ్డిని ఆశీర్వదిస్తున్న పండితులు, ప్రత్యేకాలంకారంలో ఆంజనేయస్వామి

సదుం: మండలంలోని జోగివారిపల్లె పంచాయతీ బత్తలవారిపల్లెలో నూతనంగా నిర్మించిన కార్యసిద్ధి ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఆలయంలో హనుమాన్యాసన హోమాలు, ధ్వజ ప్రాణప్రతిష్ఠ, హోమాలు, బలి పుర్ణాహుతి, బింబ దర్శనం, కన్యా దర్శనం, మహా మంగళ హారతి కార్యక్రమాలు జరిగాయి. విగ్రహ ప్రతిష్ఠాపనకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. వేద పండితులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి శేష వస్త్రంతో ఆయనను సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. విశేష అలంకారంలో ఉన్న స్వామి వారిని పెద్ద ఎత్తున గ్రామస్తులు, భక్తులు దర్శించుకున్నారు. ఆలయం వద్ద అన్నదానం చేశారు. సాయంత్రం భజన చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, సర్పంచ్ అనితాకుమారి, తిమ్మారెడ్డి, ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.


నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

ఎమ్మెల్యే పరామర్శ

సదుం: మండలంలోని జోగివారిపల్లె పంచాయతీ మారుతివారిపల్లెలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోమవారం పర్యటించారు. ఇటీవల అనారోగ్యం బారిన పడి చికిత్స పొందిన బాబురెడ్డి, రిటైర్డ్ టీచర్ రమణారెడ్డిని పరామర్శించారు. వారి ఆరోగ్యం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులతో ముచ్చటించారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్యేను కలిశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

‘పరిహారం రైతుల ఖాతాలో జమ చేయండి’

గుడుపల్లె: రైల్వే లైన్లకు భూములు కోల్పోయిన రైతులకు వెంటనే పెండింగ్‌లో ఉన్న పరిహారం సొమ్మును వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని ఆర్డీఓ శ్రీనివాసరాజు ఆదేశించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలతో ఆయన సమీక్షించారు. మారికుప్పం నుంచి కుప్పంకు వేసే రైల్వే లైన్లకు భూములు కోల్పోయిన కొంత మంది రైతులకు ఇంకా నిధులు జమ కాలేదన్నారు. వెంటనే రైల్వేకు సంబంధించిన భూముల వివరాలను తీసుకుని పరిశీలించి రైతుల ఖాతాలతో జమ చేయాలన్నారు. రైతులకు సంబంధించిన సర్వేలు, భూ సమస్యలను పరిష్కరించాలని, భూ సమస్యలేవీ పెండింగ్ ఉండరాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీతారాం, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసరాజు

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవం

పలమనేరు: పట్టణంలో ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవాన్ని స్థానిక ఏటీఎం సర్కిల్ వద్ద స్థానిక ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ సోమవారం నిర్వహించింది. కెమెరా సృష్టికర్త డాగూరే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. నాటి మహనీయుల కృషి ఫలితంగానే తాము ఫొటోగ్రఫీతో ఉపాధి పొందుతున్నామని అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేష్ అన్నారు. కార్యక్రమంలో పలువురు ఫొటో, వీడియోగ్రాఫర్లు పాల్గొన్నారు.


ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవం నిర్వహిస్తున్న ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ సభ్యులు

అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీఓ తాజ్ మస్రూర్, బైరెడ్డిపల్లె: మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్

గుడుపల్లె: గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రణాళికలు రూపకల్పన చేసుకోవాలని ఎంపీడీఓ తాజ్ మస్రూర్ అన్నారు. సోమవారం స్థానిక శ్రీశక్తి భవనంలో సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడారు. గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలు, నిర్వహణ, వ్యర్థాల నిర్వహణ, అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయడం, వీధి దీపాల ఏర్పాటు..ఇత్యాది విషయాలపై ప్రసంగించారు. గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి సర్పంచ్, కార్యదర్శి, సభ్యులు గ్రామానికి కావలసిన సౌకర్యాలపై చర్చించి, ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విజయదత్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో గ్రామాల అభివృద్ధి

బైరెడ్డిపల్లె: ప్రజలందరూ కలిసికట్టుగా కృషి చేస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీఓ రాజేంద్రబాలాజీ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, వీధిదీపాలు తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. పంచాయతీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దినప్పుడే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు సద్గుణ, మహేష్ వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. సర్పంచులు, సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బియ్యం బస్తా దొంగకు దేహశుద్ధి

పలమనేరు: పట్టణంలోని ఎస్‌బీఐ వద్ద ఓ బియ్యం దుకాణంలో బస్తా బియ్యాన్ని కొని ఫోన్‌పే చేశానని మోసం చేసి బస్తాను తస్కరించుకుపోతున్న వ్యక్తిని దుకాణ యజమానితో పాటు స్థానికులు దేహశుద్ధి చేసిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. ఏమార్చుదామనుకున్న వ్యక్తి అడ్డంగా బుక్ కావడంతో చేసేది లేక తనది తప్పేనంటూ క్షమాపణ కోరుకున్నాడు. దీంతో బియ్యం బస్తాను వదిలి అక్కడి నుంచి బతుకు జీవుడా అని తప్పించుకున్నాడు.


క్షమాపణలు చెబుతున్న బియ్యం బస్తా దొంగ

మేతకు తోలిన ఆవులు మాయం!

- ఉన్నతాధికారులకు బాధితుల ఫిర్యాదు

చిత్తూరు కలెక్టరేట్: మేతకు తోలిన ఆవులు మాయమయ్యాయని నగరానికి చెందిన బాధితులు తులసికుమార్, ఇంద్రాణి, పద్మనాభం సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ, నగరంలోని కొంగారెడ్డిపల్లె, సత్యనారాయణపురానికి చెందిన ఎనిమిది ఆవులు మేత కోసం తోలగా కనిపించడం లేదన్నారు. గాలించినా కూడా కనబడలేదని, ఎవరో వాటిని చోరీ ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆవులపై ఆధారపడి జీవిస్తున్న తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై విచారణ చేయాలని పశుసంవర్ధక శాఖ, పోలీసులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో కుమారి, వెంకటేశులు, మహేంద్రబాబు, మురళి, విజయ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద న్యాయం చేయాలని కోరుతున్న బాధితులు